ఎమ్మెల్సీ కవితకు బెయిల్.. ఓయూలో సంబురాలు

ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మిఠాయిలు తినిపించుకుంటున్న విద్యార్థి నేతలు

పటాకులు కాలుస్తున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 27: భారత జాగృతి అధినేత, ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో యునైటెడ్ ఫూలే ఫ్రంట్, భారత జాగృతి, తెలంగాణ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు సంబురాలు జరుపుకున్నారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో విద్యార్థులు స్వీట్లు పంచి, పటాకులలు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు బీసీ నర్సన్న, లింగం, మన అశోక్‌యాదవ్, ఆనంద్ మాట్లాడుతూ ఎలాంటి ఆధారాలు లేకున్నా రాజకీయ కక్షతో కేసులు నమోదు చేసి కవితక్కను అరెస్టు చేశారని ఆరోపించారు. కేవలం ప్రాంతీయ పార్టీలను లొంగదీసుకోవాలనే ఎత్తుగడలో భాగంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తమ ఆధీనంలోని ఈడీ, సీబీఐ, ఐటీ వంటి సంస్థలను ఉపయోగించుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాజ్యాంగ బద్ధసంస్థలను బీజేపీ తమ జేబు సంస్థలుగా మార్చుకుందని దుయ్యబట్టారు. తమ మాట వినని ప్రాంతీయ పార్టీల నాయకులపై వేటకుక్కల్లా ఆ సంస్థలను వదులుతూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించారు. గమనించిన సుప్రీంకోర్టు కవితక్కకు బెయిల్ మంజూరు చేయడం పై హర్షం వ్యక్తం చేశారు. ఇది కేంద్రప్రభుత్వానికి చెంపపెట్టువంటిదని అభివర్ణించారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకోకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అనేక కుట్రలు, కుతంత్రాలను జయించి, కడిగిన ముత్యంలా బయటకు వస్తున్న కవితకు స్వాగతం తెలుపుతున్నామన్నారు. విద్యార్థి నాయకులు శ్రీనివాస్, గోపి, కమలాకర్, శరత్, శోభన్, రాకేశ్, శ్రావణ్, చంద్రశేఖర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్ ఆగస్టు 27: ప్రజల సమస్యలను పరిష్కరించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని కరీం కాంపౌండ్‌లో ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ క్రమంలో ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా బస్తీ ప్రజలు డ్రైనేజీ లైన్‌లు ఏర్పాటు చేసిన అనంతరం రోడ్డు వేయక పోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు రోడ్లు వేయాలని ఆదేశించారు. అలాగే కలుషిత నీటి సరఫరాపై చర్యలు తీసుకోవాలని కోరగా అప్పటికప్పుడే జలమండలి అధికారులతో మాట్లాడి సమస్యను గుర్తించి పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. వీటితో పాటు వీధి దీపాల సమస్యలు, రోడ్ల సమస్యలను గుర్తించారు. బస్తీ వాసులు సూచించిన సమస్యలను తప్పకుండా అధికారులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే గతంలో ఈ ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, జలమండలి, అధికారులు పాల్గొన్నారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 27: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ – మెకానికల్, బీఎస్సీ ఏవియేషన్ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును వచ్చే నెల 3వ తేదీ లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 6వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను అక్టోబర్ నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osm ania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వివిధ కోర్సుల ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 27: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీసీఏ (సీబీసీఎస్) కోర్సు పరీక్షా ఫలితాలతో పాటు అన్ని విభాగాల బీఈ (సీబీసీఎస్) రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఎమ్మెస్సీ మాలిక్యులార్ జెనిటిక్స్ పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 27: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎమ్మెస్సీ మాలిక్యులార్ అండ్ హ్యూమన్ జెనిటిక్స్ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 31వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

ఎంసీపీ పరీక్షా తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 27: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంసీపీ పరీక్షా తేదీలను మార్చినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీపీ (సీబీసీఎస్) (రెండేళ్ల కోర్సు) రెండు, నాలుగో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించామని చెప్పారు. అదే రోజు పరీక్షలు ప్రారంభమవుతున్నప్పటికీ, ఇతర పరీక్షా తేదీలను మార్చినట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దరఖాస్తును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేశ్

అర్హులందరికీ గృహజ్యోతి అమలు చేస్తాం

మారేడ్‌పల్లి, ఆగస్టు 27: కంటోన్మెంట్ నియోజకవర్గంలో అర్హులందరికీ గృహజ్యోతి పథకం అమలు చేస్తామని ఎమ్మెల్యే శ్రీ గణేశ్ తెలిపారు. మంగళవారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ఆయన సమావేశమయ్యారు. ముఖ్యంగా గృహజ్యోతి పథకం తమకు అమలు కావడం లేదని ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులతో స్పందించిన ఎమ్మెల్యే శ్రీ గణేశ్ సంబంధిత అధికారులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పటిష్టాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి పథకాన్ని కంటోన్మెంట్ ప్రాంతంలో మరోసారి దరఖాస్తులను తీసుకొని అర్హులైన వారందరికీ అందజేయాలని అన్నారు. నియోజకవర్గంలోని 8 వార్డులతో పాటు మోండా డివిజన్‌లో ఒక్కొక్క వార్డుల్లో ఒక్క రోజు దరఖాస్తులను స్వీకరించాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ముఖ్యంగా ఫుడ్ సెక్యూరిటీ కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు ఉన్న వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చునని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ అధికారులు డీఈలు, ఏఈలు రవికుమార్, సూచిండ్రన్, రామచారి, విజయ్ కుమార్, నరేశ్‌రెడ్డి, సాయి జగదీశ్, భరత్, అర్చిత, వంశిధర్‌రెడ్డి, రాకేశ్, శ్రీధర్, రామానుజ చారి పాల్గొన్నారు.

ఐదేళ్ల లా కోర్సును కొనసాగించాలి

రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 27: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బషీర్‌బాగ్ పీజీ లా కళాశాలలో ఐదేళ్ల లా కోర్సును యథావిధిగా కొనసాగించాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మారపు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశ ప్రక్రియలోని వెబ్ ఆప్షన్లలో కళాశాల పేరులేకపోవడం బాధాకరమన్నారు. కోర్సును యథావిధిగా కొనసాగించాలని కోరుతూ వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి ఏటా కళాశాలలో 60 మందికి లా అభ్యసించేందుకు సీట్లు దొరికేవని, కానీ ఈ ఏడాది ఆ అవకాశం లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సును రద్దు చేయాలనే ఆలోచనలు చేసినప్పటికీ, విద్యార్థులు ప్రతిఘటించడంతో వెనక్కి తగ్గారని గుర్తు చేశారు. మళ్లీ అటువంటి నిర్ణయం తీసుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రతీసారి కళాశాలపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెబ్‌ఆప్షన్లలో పీజీ లా కళాశాలను చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్, టీజీవీపీ, బీఆర్ఎస్వీ తదితర సంఘాల నాయకులు రత్నావత్ వంశీ, వడ్డెపల్లి సందీప్, వినీత్‌రెడ్డి, సాయిప్రదీప్, శ్రీను, అశోక్, శివ పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ను కలిసిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

సికింద్రాబాద్,ఆగస్టు27: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో ఉన్న పలు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కార్పొరేటర్ హేమ అధికారులకు సూచించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జీహెచ్ఎంసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్ కార్పొరేటర్ హేమ నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ హేమ మాట్లాడుతూ ప్రజల మన్ననలు పొందేలా సేవలు అందించాలని, ఏదన్నా సమస్యలు ఎదురైతే తమ సహకారం సంపూర్ణంగా ఉంటుందని తెలిపారు. రానున్న వినాయక చవితిని దృష్టిలో పెట్టుకొని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు , రాంకీ సర్కిల్ ఇన్‌చార్జి దశరథ్,సిబ్బంది లావణ్య పాల్గొన్నారు.

శ్రీ కృష్ణాష్టమి

శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న యాదవ ప్రముఖులు

అమీర్‌పేట్, ఆగస్టు 27 : రాష్ట్ర యాదవ మహాసభ ఆధ్వర్యంలో 65వ శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం అర్ధరాత్రి వరకు కొనసాగాయి. మహాసభ అధ్యక్షుడు యల్లావుల చక్రధర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అధికార, అనధికార ప్రముఖులు హాజరయ్యారు. మందుగా గోపూజతో వేడుకలు ప్రారంభం కాగా, శ్రీయ కృష్ణ భగవానునికి విశేష పూజలతో పాటు చిన్నారులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఏపీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, తెలుగు రాష్ట్రాల పార్లమెంట్ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్, ఉమ్మడి ఏపీ సమాచార హక్కు చట్టం మాజీ చీఫ్ కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ,తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర సమయంలో అంబులెన్స్ సైరన్ వాడాలి



అంబులెన్స్ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న గ్రేటర్ అధ్యక్షుడు సురేశ్

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 27 : రోగులను అత్యవసర వైద్య సేవలు అందించేందుకు తరలించే సమయంలో మాత్రమే సైరన్ వాడాలని గ్రేటర్ హైదరాబాద్ ప్రైవేట్ అంబులెన్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్ సూచించారు. మంగళవారం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి వద్ద ఉన్న తెలంగాణ ప్రైవేట్ అంబులెన్స్ సర్వీసెస్ పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ ఇటీవల నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో చెప్పిన ముఖ్యమైన అంశాలను ట్రాఫిక్ ఈస్ట్ జోన్ డీసీపీ అశోక్ కుమార్, ఏసీపీ సంపత్, చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నామని ఆయన అన్నారు. అంబులెన్స్‌లో రోగులు లేనప్పుడు సైరన్ వాడకూడదని, ప్యాసింజర్లను అంబులెన్స్‌లో ఎక్కించకూడదని, సరైన డాక్యుమెంట్లు వాహనంలో పెట్టుకోవాలని సూచించారు. డెడ్ బాడీలు తరలించే సమయంలో, ఖాళీగా వెళుతున్న సమయాల్లో సైరన్ వినియోగించకూడదని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్క డ్రైవర్ పాటించాలని, పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ అవగాహన శిబిరంలో మజహర్, నరేందర్, సాదిక్, ముఖేశ్, లాయిఖ్, హరికృష్ణలు పాల్గొన్నారు.

సంస్కృత అకాడమీలో భాషాధ్యయన శిబిరం

మాట్లాడుతున్న ప్రొఫెసర్ నీలకంఠం

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 27: ఓయూలోని సంస్కృత అకాడమీలో 30 రోజుల సంస్కృత భాషాధ్యయన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ ప్రొఫెసర్ నీలకంఠం తెలిపారు. ఈ శిబిరాన్ని వచ్చే నెల 2వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. అకాడమీలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ నీలకంఠం మాట్లాడుతూ తమ అకాడమీ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సంస్కృత పరిశోధన కేంద్రంగా గుర్తింపు పొందినదని చెప్పారు. ప్రతి ఏటా జూలై, ఆగస్టు నెలల్లో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, పరిపాలనపరమైన అనుమతులు ఆలస్యం కావడంతో ఈ ఏడాది ఆలస్యమైందని వివరించారు. 2వ తేదీ నుంచి సెలవు దినాలను వదిలి, 30 పనిదినాలలో ఈ శిక్షణ నిర్వహిస్తామని చెప్పారు. శిబిరంలో భాగంగా ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు బోధన నిర్వహిస్తామని పేర్కొన్నారు. సంస్కృత భాషలో మాట్లాడడం, చదవడం, రాయడం, వినడం అనే నాలుగు విధాల భాషాకౌశలములను అందించేందుకు అనుభవజ్ఞులైన అధ్యాపకుల నిర్వహణలో తరగతులు నిర్వహిస్తామని వివరించారు. సాధారణ సంస్కృత భాషతో పాటు వ్యాఖ్యానసహితంగా పతంజలి యోగా సూత్రములను సరళ సంస్కృత భాషలో బోధించడం శిబిరానికి అదనపు ఆకర్షణ అని అన్నారు. ప్రతి రోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి అయిదు గంటల వరకు ఆయా శాస్త్రాలలో నిష్ణాతులైన పండితులను ఆహ్వానించి వివిధ శాస్త్రాలపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంస్కృత భాష వ్యాకరణాన్ని కంప్యూటర్ ద్వారా నేర్చుకొనుటకు శిక్షణ ఇస్తామని చెప్పారు. శిబిరానికి హాజరయ్యేవారికి సులువైన పాఠ్యపుస్తకాలను సైతం అందజేస్తామని పేర్కొన్నారు. సంస్కృతంగా ఎటువంటి ప్రాథమిక జ్ఞానం లేకపోయిన ఆసక్తి ఉన్న వారు ఈ శిబిరంలో శ్రద్ధగా పాల్గొన్నచో భాషా జ్ఞానాన్ని పొంది, సంస్కృత మూల గ్రంథాలను అధ్యయనం చేయగలుగుతారన్నారు. కేవలం యాభై సీట్లు మాత్రమే ఉన్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరికి వ్యక్తిగతమైన శ్రద్ధతో వివిధరకాల శిక్షణా నియమాలతో సంస్కృతం బోధిస్తామని, ప్రతి ఒక్కరూ 30 రోజులు పూర్తయ్యేసరికి సంస్కృతంలో మాట్లాడేవిధంగా తీర్చిదిద్దుతామని వివరించారు. సీట్లు పరిమితమని, ముందు వచ్చిన వారికి ముందు ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తామని చెప్పారు. వివరాలకు 93986 01140, 9866498906, 8331021 001 నెంబర్లలో సంప్రదించాలన్నారు. డాక్టర్ వరలక్ష్మి, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి

శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న జైళ్ల శాఖ డీజీపీ,ఐపీఎస్ అధికారి సౌమ్య మిశ్రా

పూజల్లో పాల్గొన్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తనయుడు కిశోర్‌గౌడ్

సికింద్రాబాద్,ఆగస్టు27: సీతాఫల్‌మండిలో త్రీస్టార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 42సంవత్సరాలుగా ఈవేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చైర్మన్ చెన్నయ్యగౌడ్,అధ్యక్షుడు కృష్ణ తెలిపారు. మూడు రోజుల పాటు ఈ వేడుకలు కన్నుల పండువగా నిర్వహిస్తామని అన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ డీజీపీ, ఐపీఎస్ అధికారి సౌమ్య మిశ్రా ,సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తనయుడు తీగుళ్ల కిశోర్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో త్రీస్టార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు భాస్కర్‌రావు,అశ్విన్, కృష్ణ,బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బొల్లారం: కంటోన్మెంట్ ఎనిమిదో వార్డు బొల్లారం రిసాల బజార్‌లోని యాదవ సంఘంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ సీనియర్ మహిళా నేత నివేదిత ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పింజర్ల మురళీ యాదవ్, గోపాల్ యాదవ్, ఆనంద్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రిసాల బజార్‌లో శ్రీకృష్ణాష్టమి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహిళా నేత నివేదిత

చిన్నారులకు జ్ఞాపికను బహూకరిస్తున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి

పూజల్లో పాల్గొన్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్

వచ్చే నెల 1న మట్టి గణపతుల తయారీ పోటీలు

అమీర్‌పేట్, ఆగస్టు 27 : పర్యావరణ హితమైన మట్టి గణపతుల వినియోగం పై చిన్నారులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో సనసత్‌నగర్‌లోని మోడల్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కాలనీ కమ్యూనిటీ హాలు 'సంస్కృతి'లో సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు 14 సంవత్సరాల లోపు వయసున్న చిన్నారులకు మట్టి వినాయకులను తయారు చేసే పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీలకు హాజరయ్యే చిన్నారులకు మట్టి వినాయక ప్రతిమలకు అవసరమైన మట్టిని తామే అందిస్తామని, అయితే ప్రతిమల అలంకరణలకు వినియోగించే వస్తువులు ఎవరికి వారే తెచ్చుకోవాల్సి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా వినాయక ప్రతిమల తయారీ తరువాత, అసలు వినాయక చవితి అంటే ఏమిటి, ఎందుకు జరుపుకుంటారు, మట్టి గణపు వల్ల పర్యావరణానికి చేకూరే మేలు..ఈ మూడు అంశాలపై అచ్చ తెలుగులో చిన్నారులు ఒక నిమిషం పాటు ప్రసంగించాల్సి ఉంటుందని, ఈ రెండు అంశాల ఆధారంగా పోటీలో నిలిచిన చిన్నారులను మొదటి మూడు బహుమతులకు ఎంపిక చేయడం జరుగుతుందని, చిన్నారులు తమ పేర్లను 8008352140కు కాల్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

ముషీరాబాద్, ఆగస్టు 27: బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టులో బెయిల్ లభించడం పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. పటాకులు కాల్చి, మిఠాయిలు పంచుతూ సంబురాలు చేసుకున్నారు. రాంనగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు రావులపాటి మోజెల్, ముషీరాబాద్ జాగృతి కన్వీనర్ పరకాల మనోజ్ గౌడ్ ఆధ్వర్యంలో మిఠాయిలు పంచిపెట్టారు.

పీహెచ్‌డీ కేటగిరీ 2 సీట్లకు నోటిఫికేషన్ విడుదల చేయాలి



రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 27: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీహెచ్‌డీ కేటగిరీ 2 సీట్ల భర్తీ కోసం తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. నోటిఫికేషన్‌లో యూజీసీ నెట్ తప్పనిసరి అనే నిబంధనను ఎత్తివేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఓయూ కమిటీ ఆధ్వర్యంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి మాట్లాడుతూ రెండేళ్ల నుంచి పీహెచ్‌డీ కేటగిరీ 2 సీట్ల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేయలేదని గుర్తు చేశారు. పాతవిధానంలోనే తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రొఫెసర్లకు గైడ్‌షిప్ ఇచ్చేందుకు వయోపరిమితిని 57 ఏళ్లకు కుదించడాన్ని తప్పుబట్టారు. విద్యార్థుల పరిశోధన, వర్సిటీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఇప్పటికే ప్రొఫెసర్ల పదవీ విరమణతో గైడ్‌ల సంఖ్య తగ్గిపోయిందని, వర్సిటీ నిర్ణయంతో మరింత మంది గైడ్‌ల సంఖ్య తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి రవినాయక్, నాయకులు అజయ్, మల్సూర్, శర్మ, అరవింద్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యలు పరిష్కరించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 27: రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యలను పరిష్కరించాలని పలువురు కాంట్రాక్ట్ అధ్యాపక సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు మాట్లాడుతూ తమకు బేసిక్ పే, డీఏ, హెచ్ఆర్ఏతో కూడిన పే స్కేళ్లను వెంటనే అమలు పరచాలని కోరారు. సోమవారం ఒక కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ త్వరలోనే వర్సిటీలకు వీసీలను నియమిస్తామని, వర్సిటీలలో ఖాళీగా ఉన్న అధ్యాపక, అధ్యాపకేతర పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. అనేక ఏళ్లుగా వర్సిటీలనే నమ్ముకుని పరిశోధన, బోధనపై ఆసక్తితో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల గురించి ఎటువంటి ప్రస్తావన లేకపోవడం విచారకరమని అన్నారు. ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో విశ్వవిద్యాలయాలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకులకు తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ పెద్దలను కలిసి మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12 వర్సిటీలలో మొత్తం అధ్యాపక పోస్టుల ఖాళీలు 2,205 ఉండగా, కాంట్రాక్ట్ అధ్యాపకులు 1,445 మంది ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపక సంఘాల నాయకులు డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ విజయేందర్‌రెడ్డి, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ తాళ్లపల్లి వెంకటేశ్, డాక్టర్ రేష్మారెడ్డి, డాక్టర్ యాదయ్య, డాక్టర్ చిరంజీవి, డాక్టర్ భూక్యా రమేశ్, డాక్టర్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

IN THE COURT OF THE HON'BLE III ADDL. SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS :: AT SECUNDERABAD
O.S.No. 125 OF 2024
BETWEEN:
Smt. Vasa Indira Dev